## ఎన్ఎస్‌పీసీఎల్‌కు సింగరేణి బొగ్గు

హైదరాబాద్ మే 15 (నమస్తే తెలంగాణ): సింగరేణి నుంచి ఎన్ఎస్‌పీసీఎల్(ఎన్‌టీపీసీ సెయిల్ పవర్ కంపెనీ)కి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 5 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు గురువారం సింగరేణి కాలరీస్, ఎన్ఎస్‌పీసీఎల్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. సింగరేణి సీఎండీ బలరాం ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్‌మెంట్ ఎస్‌డీఎం సుభానీ సమక్షంలో సింగరేణి జీఎం(మార్కెటింగ్) ఎన్వీ రాజశేఖర్‌రావు, ఎన్ఎస్‌పీసీఎల్ సీఈవో దివాకర్ కౌశల్, జీఎంలు నీల్ కమల్, పలాష్‌లు అగ్రిమెంట్‌పై సంతకాలు చేశారు. సింగరేణి నాణ్యమైన బొగ్గు సరాఫరా చేస్తుందనే నమ్మకంతోనే ఈ ఒప్పందం చేసుకున్నామని ఎన్ఎస్‌పీసీఎల్ అధికారులు వెల్లడించారు.

## 5 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు

న్యూఢిల్లీ, మే 15: గత నెలలో దేశ ఎగుమతులు, దిగుమతుల మధ్య అంతరం 5 నెలల గరిష్ఠాన్ని తాకింది. గురువారం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం ఏప్రిల్‌లో ఎగుమతులు 9.03 శాతం పెరిగి 38.49 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇక దిగుమతులు 19.12 శాతం ఎగిసి 64.91 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్య లోటు 5 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 26.42 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ముడి చమురు దిగుమతులు 25.6 శాతం ఎగబాకి 20.7 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. బంగారం దిగుమతులు 3.09 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

# డౌన్ ట్రెండ్‌లో గోల్డ్

### క్రమేణా తగ్గుముఖం పడుతున్న బంగారం ధరలు

- రెండు రోజుల్లో రూ.2,450 పతనం
- హైదరాబాద్‌లో స్వచ్ఛమైన పుత్తడి తులం రూ.93,930
- రూ.86,100 పలుకుతున్న 22 క్యారెట్ పసిడి విలువ



*గోల్డ్ మార్కెట్ రివర్స్ గేర్ తీసుకున్నది.*

***మొన్నటిదాకా ఫుల్ స్వింగ్‌లో ఉన్న బంగారం ధరలు ఇప్పుడు డౌన్ ట్రెండ్‌లోకి జారుకున్నాయి.***

*రెండు రోజుల్లో తులం విలువ రూ.2,450 పతనమైంది మరి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ రేటు 10 గ్రాములు రూ.93,930 పలుకుతున్నది.*

న్యూఢిల్లీ, మే 15: దేశీయ మార్కెట్‌లో బంగారానికి గిరాకీ సన్నగిల్లిందా? అంటే.. అవుననన్నట్టుగానే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతకొద్దిరోజులుగా పసిడి ధరలు తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతుండటమే ఇందుకు నిదర్శనం. ఈ క్రమంలోనే దేశ రాజధాని ఢిల్లీలో రెండు రోజుల్లోనే పుత్తడి రేటు దాదాపు రెండున్నర వేల రూపాయలు పడిపోయింది. గురువారం 24 క్యారెట్ తులం విలువ రూ.1,800 దిగజారి రూ.95,050కి పరిమితమైంది. బుధవారం కూడా రూ.650 క్షీణించగా, సోమవారమైతే ఏకంగా రూ.3,400 పతనం కావడం గమనార్హం.

**హైదరాబాద్‌లో..**

హైదరాబాద్‌లోనూ బంగారం ధరలు దిగొస్తున్నాయి. గురువారం 24 క్యారెట్ తులం రేటు రూ.2,130 తగ్గి రూ.93,930గా నమోదైంది. 22 క్యారెట్ 10 గ్రాముల విలువ రూ.1,950 పడిపోయి రూ.86,100గా ఉన్నది. అయితే ధరల్లో స్థిరత్వం లోపించడం.. కొనుగోలుదారులను వేచి చూసే ధోరణిలోకి నెడుతున్నదని జ్యుయెల్లర్స్ వాపోతున్నారు. మార్కెట్‌లో ఈ ఒడిదొడుకులు తగ్గితే వ్యాపారం తిరిగి పుంజుకోవచ్చన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత నెల ఏప్రిల్ 22న దేశీయంగా పసిడి ధర ఆల్‌టైమ్ హైని తాకుతూ తులం 24 క్యారెట్ రూ.1,01,600 పలికిన సంగతి విదితమే.

**వెండి ధరలు కూడా..**

బంగారంతోపాటు వెండి ధరలూ దిగొస్తున్నాయి. వరుసగా నాల్గోరోజూ రేట్లు పడిపోగా.. గురువారం మరో రూ.1,000 తగ్గి కిలో వెండి విలువ రూ.97,000కు పరిమితమైంది. బుధవారం రూ.1,450 పతనమవగా, మొత్తంగా ఈ నాలుగు రోజుల్లో రూ.2,900 క్షీణించినట్టైంది. కాగా, అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పడిపోతున్నాయని, ఆ ప్రభావం దేశీయ మార్కెట్‌పైనా సహజంగానే ఉంటున్నదని అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. ఇక అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ రేటు 16.81 డాలర్లు దిగి 3,160.71 డాలర్లకు చేరింది. మొత్తానికి ఆయా దేశాల మధ్య భౌగోళిక, రాజకీయ, వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు తగ్గడంతో ఇన్వెస్టర్లు.. తమ పెట్టుబడులను బంగారం నుంచి వెనక్కి తీసుకుంటున్నారని మార్కెట్ నిపుణులు తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు. ఇది ధరల క్షీణితకు దారితీస్తున్నట్టు అభివర్ణిస్తున్నారు.

**పతనానికి ప్రధాన కారణాలు**

- శాంతించిన భౌగోళిక ఉద్రిక్తతలు
- భారత్-పాక్ మధ్య తగ్గిన ఆందోళనలు
- అమెరికా-చైనా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్
- మళ్లీ స్టాక్ మార్కెట్లలోకి మదుపరుల పెట్టుబడులు
- అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల క్షీణత
- అంతంతమాత్రంగా డిమాండ్

## టాటా లాక్‌హీడ్‌పై కఠిన చర్యలు వద్దు

**ఈపీఎఫ్‌వోకు హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): బకాయిల వసూలులో భాగంగా విమాన విడిభాగాల తయారీ సంస్థ టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ (టీఎల్ ఎంఏఎల్)పై ఎంప్లాయిస్ ప్రావిడెంట్ కఠిన చర్యలు తీసుకోరాదని హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 21 వరకు నిషేధిత జాబితాలో ఉంచి ఖాతాలు స్తంభింపజేయరాదని ఉత్తర్వుల్లో పేర్కొంది. 2012 నుంచి 2017 మధ్యకాలంలో పనిచేసిన 14 మంది విదేశీ కార్మికులకు పీఎఫ్ జమ చేయకపోవడంతో ఈపీఎఫ్ఓ ఈ కంపెనీని నిషేధిత జాబితాలో చేర్చి బ్యాంకు ఖాతాను స్తంభింపజేయడానికి ఉత్తర్వులు జారీ చేసింది. ఈచర్యను టీఎల్ ఎంఏఎల్ సంస్థ సవాలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పుల్లా కార్తీక్ ఇటీవల విచారించారు. సంస్థ ఇప్పటికే రూ.4 కోట్లు డిపాజిట్ చేసిందని, మిగిలిన రూ.10 కోట్లలో రూ.4.30 కోట్లు రికవరీ కూడా చేసినట్టు కంపెనీ తరుపున వాదిస్తున్న న్యాయవాది తెలిపారు. కౌంటర్ దాఖలు చేయాలని ఈపీఎఫ్ ఓను ఆదేశించిన హైకోర్టు విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది.

# సెమీకండక్టర్ల ప్లాంట్ హుళక్కే?

### తాజాగా యూపీలో ఏర్పాటుచేస్తున్న ఫాక్స్‌కాన్

### ఇప్పటికే రాష్ట్రం నుంచి వెనక్కి వెళ్లిన రెండు కంపెనీలు

హైదరాబాద్, మే 15(నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో సెమీకండక్టర్ల పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన ఒక్కో సంస్థ ఇక్కడి అమడదూరంగా వెళ్లిపోతున్నాయి. దీంతో చిప్‌ల తయారీ పరిశ్రమ ఇక్కడికి రావడం ఎండమావిగానే కనిపిస్తున్నది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు కంపెనీలు రాష్ట్రంలో యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇక్కడ ఏర్పాటు చేయలేమని భావించి ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లిపోయాయి. ఇప్పటివరకు దేశంలో ఆరు సెమీకండక్టర్ యూనిట్లకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపగా..అందులో మన రాష్ట్రానికి చోటు లేకపోవడం విశేషం. నాలుగు యూనిట్లు గుజరాత్‌లో ఏర్పాటుకానుండగా, ఒకటి అస్సాం, మరొకటి ఉత్తరప్రదేశ్‌కు తరలిపోయింది. ఇక్కడ యూనిట్ ఏర్పాటునకు అవసరమైన పర్యావరణ పరిస్థితులు పుష్కలంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ సర్కార్ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రానికి గుడ్‌బై పలుకుతున్నాయి. ఇదే క్రమంలో హెచ్‌సీఎల్, ఫాక్స్‌కాన్ సంయుక్త భాగస్వామ్యంలో రూ.3,706 కోట్ల పెట్టుబడితో ఉత్తరప్రదేశ్‌లో చిప్‌ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చాయి. వచ్చే రెండేండ్లలో అందుబాటులోకి రానున్న ఈ యూనిట్‌లో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఆటోమొబైల్స్, పీసీల కోసం డిస్‌ప్లే డ్రైవ్ చిప్‌లు తయారుకానున్నాయి. తాజా చిప్ యూనిట్‌కు క్యాబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో మన రాష్ట్రంలో సెమీకండక్టర్ల పరిశ్రమ భవితవ్యంపై సర్వత్రా చర్చ మొదలైంది. దీనికి కారణం లేకపోలేదు. ఐటీ రంగానికి ప్రధాన కేంద్రంగా మారిన హైదరాబాద్‌ను సెమీకండక్టర్ల తయారీలోనూ అభివృద్ధి చేయాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషిచేసింది. ఇప్పటికే ప్రపంచ ప్రఖ్యాత ఐటీ కంపెనీల ఏర్పాటు ద్వారా మన రాష్ట్రంలో సెమీకండక్టర్ల పరిశ్రమకు అవసరమైన పర్యావరణ వ్యవస్థ ఏర్పాటైంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ విశేష కృషితో కార్నింగ్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్, కేన్స్ సెమికాన్ కంపెనీలు రాష్ట్రంలో సెమీకండక్టర్ల యూనిట్లు స్థాపించేందుకు ముందుకొచ్చాయి. ఈలోగా రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కార్నింగ్ తమిళనాడుకు, కేన్స్ సెమికాన్ గుజరాత్‌కు తరలివెళ్లిపోయింది.

**సెమీకండక్టర్లకు గిరాకీ..**

సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతున్న వేళ సెమీకండక్టర్ల పరిశ్రమకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న గిరాకీ అంతాఇంతా కాదు. కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక అవసరాలు, విమానయాన రంగం తదితర వాటిల్లో చిప్‌ల వినియోగం రోజురోజుకూ గణనీయంగా పెరుగుతున్నది. ఇందులో భాగంగా దిగుమతులను తగ్గించి దేశంలోనే సెమీకండర్ల తయారీని ప్రోత్సహించేందుకు ఇండియా సెమీకండక్టర్ మిషన్(ఐఎస్ఎం)ను ఏర్పాటు చేసింది.

**రాష్ట్రానికి రావడానికి జంకుతున్న కంపెనీలు**

సెమీకండక్టర్ యూనిట్ల స్థాపనకు రాష్ట్రంలో పుష్కలమైన వనరులు ఉన్నప్పటికీ కంపెనీలు ముందుకు రాకపోవడంపట్ల పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అనేక ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సేవలను అందిస్తున్నప్పటికీ.. సెమీకండక్టర్ల యూనిట్ ఏర్పాటు చేయడానికి ముందుకురావడం లేదు. వీటిలో అమెరికాకు చెందిన ఇంటెల్, క్వాల్కమ్, మైక్రోచిప్ టెక్నాలజీ ఇంక్.. అలాగే, జర్మనీకి చెందిన ఇన్ఫినియస్ టెక్నాలజీ, టెస్సోల్, మైక్రాస్ టెక్నాలజీ, మోస్‌చిప్, మిరాఫ్రా టెక్నాలజీ, ఏఎండీలు ఉన్నాయి.

# అమ్మకానికి భూములు

### రూ.1,000 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యం

న్యూఢిల్లీ/ముంబై, మే 15: పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన ప్రభుత్వ రంగ టెలికం సంస్థలు భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్), మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్ (ఎంటీఎన్ఎల్) స్థిరీకరణకు.. వాటి భూములను అమ్మే దిశగా కేంద్ర ప్రభుత్వం వెళ్తున్నది. ఇందులో భాగంగానే ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) దాదాపు రూ.1,000 కోట్ల విలువైన భూములను విక్రయించాలని చూస్తున్నట్టు సంబంధిత అధికారి ఒకరు చెప్తున్నారు. తద్వారా ఆయా సంస్థల రుణ భారాన్ని తగ్గించవచ్చని, వాటి ద్రవ్యలభ్యతను కూడా పెంచవచ్చని అంటున్నారు. ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ప్రభుత్వ రంగ సంస్థల శాఖ (డీపీఈ) భూములను గుర్తించగా.. వీటిని వీలైతే అమ్మడమో లేదా లీజుకు ఇవ్వడమో చేసే ఆలోచనలో మోదీ సర్కారు ఉన్నది. కాగా, బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌కు దేశంలోని ప్రధాన నగరాల్లో భూములుండగా.. 2-3 చోట్ల భూములను అమ్మకానికి తీసుకురాబోతున్నారు. ఈ ఏడాదిలోనే వీటిని అమ్మవచ్చని, రూ.1,000 కోట్లు రావచ్చని అంచనా.

**సర్కారీ వైఫల్యం**

ప్రభుత్వ సంస్థలే అయినప్పటికీ మార్కెట్‌లో ప్రైవేట్ రంగ కంపెనీలతో పోటీపడలేక బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ చతికిలపడ్డాయి. అయితే ఇందుకు కారణం కేంద్ర ప్రభుత్వ పెద్దలేనన్న విమర్శలు ఆయా సంస్థల ఉద్యోగ సంఘాలు, ఆర్థిక విశ్లేషకుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ప్రధానంగా స్పెక్ట్రం కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వకపోవడం చాలాచాలా నష్టపర్చిందన్న వాదనలు న్నాయి. దీంతో ఏండ్ల తరబడి నెట్‌వర్క్‌ను విస్తరించలేక, సిగ్నలింగ్ లోపాలతో సబ్‌స్క్రైబర్లు దూరమైపోతున్నారు. మరోవైపు ఆదాయం లేక, నిర్వహణ భారమై అప్పుల ఊబిలో కూరుకుపోయాయని చెప్తున్నారు. రుణ చెల్లింపుల్లో ఎంటీఎన్ఎల్ విఫలమవుతుండటంతో రుణదాతల (బ్యాంకర్లు)తో క్యాబినెట్ సెక్రటరీ టీవీ సోమనాథన్ శుక్రవారం సమావేశమవుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది.

- గత ఏడాది నవంబర్ నాటికి బీఎస్ఎన్ఎల్ రుణ భారం రూ.23,297 కోట్లు.
- ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.33,000 కోట్లు దాటిన ఎంటీఎన్ఎల్ మొత్తం అప్పులు.
- బ్యాంకులకు రూ.8,346 కోట్లను చెల్లించడంలో విఫలమైన ఎంటీఎన్ఎల్.

## ఆమె పట్టుదల.. వైకల్యాన్ని జయించింది

- ఒంటి చేత్తో 'షూటింగ్'లో రాణించిన నవోదయ గిరిజన బాలిక
- ఢిల్లీలో పోటీల్లో పాల్గొన్న రెండో రోజే 12వ తరగతి పబ్లిక్ పరీక్ష
- పరుపరుగున తిరిగొచ్చి పరీక్షకు హాజరు.. 79 శాతంతో ఉత్తీర్ణత..

ఢిల్లీ ఖేలో ఇండియా పారాలింపిక్స్‌లో షూటింగ్‌లో పాల్గొన్న విద్యార్థిని పావని

కూసుమంచి, మే 15: పుట్టుకతోనే ఒక చేతిని సగం వరకూ కోల్పోయిన ఓ బాలిక.. అటు ప్రతిష్ఠాత్మక జాతీయ క్రీడల్లోనూ, ఇటు ఉన్నత చదువుల్లోనూ పట్టు వదలకుండా పరిశ్రమించింది. అవాంతరాలు, ఆటంకాలు చుట్టుముట్టినా వెనుకంజ వేయలేదు. అపజయమన్నది ఎరుగలేదు. చివరికి అడ్డంకిగా ఉందనుకున్న వైకల్యాన్ని కూడా ఆమె పటాపంచలు చేసింది. అందుకే.. ఆమె వైకల్యాన్ని జయించింది. చదువులోనూ అద్భుతంగా రాణించింది. ఆమె ఎవరో కాదు.. కూసుమంచి మండలంలోని పాలేరు జవహర్ నవోదయకు చెందిన గిరిజన బిడ్డ బాణోత్ పావని. రఘునాథపాలెం మండలానికి చెందిన బాణోత్ పావని పాలేరు నవోదయలో 12వ తరగతి చదువుతోంది. తండ్రి సుతారీ మేస్త్రీ, తల్లి చిన్నపాటి దర్జీ. పావనికి పుట్టుకతోనే ఎడమ చేయి మోచేతి వరకూ లేదు. కానీ ఎక్కడా అధైర్య పడలేదు. పైగా తనను ఆకర్షించిన షూటింగ్ క్రీడలో అద్భుతంగా రాణించింది. ఎనిమిదికిపైగా మెడల్స్ సాధించింది. అయితే, మొన్నటి మార్చి నెలలో 12వ తరగతి పరీక్షలు కొనసాగుతున్న సమయంలోనే ఢిల్లీలో ఖేలో ఇండియాలో పోటీల్లో పాల్గొనాల్సి వచ్చింది. అటు ఆటకు, ఇటు పరీక్షకు మధ్య ఒక్క రోజు వ్యవధి మాత్రమే ఉంది. పైగా ఢిల్లీ నుంచి పరుగుపరున రావాల్సిన క్లిష్ట సమయం. అయినా ఆమె వెరువ లేదు. మార్చి 23న ఢిల్లీలో మొక్కవోని దీక్షతో షూటింగ్‌లో పాల్గొన్నది. కాంస్య పతకాన్ని కొల్లగొట్టింది. ఆ మరుక్షణమే బయలుదేరింది. 25న పరీక్ష సమయానికి పాలేరు నవోదయకు చేరుకుంది. ఇక్కడ పరీక్షనూ రాసింది. ఇందులో ఏకంగా 79 శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటింది. కాగా, అటు పరీక్షలోనూ, ఇటు జాతీయస్థాయి క్రీడలోనూ ప్రతిభ చాటిన పావనిని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీనియర్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అభినందించారు.

## ఆగస్టు నాటికి గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి

- గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల



పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

వేంసూరు, మే15: వచ్చే ఆగస్టు నాటికి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు పూర్తిచేసి ఖమ్మం నుంచి సత్తుపల్లి వరకు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం దేవరపల్లి నుంచి ఖమ్మం వరకు జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను ఆయన స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి పరిశీలించారు. వేంసూరు ఎగ్జిట్‌పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి మండలం ముత్తగూడెం నుంచి ఆంధ్ర సరిహద్దు రేచర్ల వరకు 42 కి.మీ. మేర రూ.804 కోట్ల ఖర్చుతో జరుగుతున్న పనులు దాదాపు 80 శాతం పూర్తయినట్లుగా తెలిపారు. జూలై అఖరి నాటికి పనులు పూర్తి చేసుకొని ఆగస్టు 15 లోగా హైవే రవాణా ప్రారంభమయ్యే విధంగా ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈ ప్యాకేజీలో మొత్తం 52 కల్వర్టులు, అండర్ పాస్‌బ్రిడ్జి నిర్మాణాలు ఉండగా దాదాపు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మట్టా దయానంద్, తుమ్మల యుగంధర్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, చల్లగుండ్ల నర్సింహారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనందబాబు, భాగం నీరజాచౌదరి, మున్సిపల్ వైస్‌చైర్మన్ తోట సుజలరాణి తదితరులు పాల్గొన్నారు.

**గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల పరిశీలన**

వైరాటౌన్, మే15: వైరా మండల కేంద్రం మీదుగా సూర్యాపేట టూ దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే పనులను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వరరావు, బొర్రా రాజశేఖర్, పుచ్చకాయల వీరభద్రం, శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

**సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి**

కొణిజర్ల, మే 15: ఖమ్మం- దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని మండలంలోని పెద్దగోపతి, పెద్దమునగాల, చిన్నమునగాల, బొట్లకుంట్ల, చిన్నగోపతి, బస్వాపురం గ్రామాలకు చెందిన రైతులు గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మంత్రి రైతులకు సర్వీస్ రోడ్డు చేపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్వర్ణ సుబ్బారావు, వడ్డే నారాయణరావు, పూటుకూరి రంజిత్, రైతులు పాల్గొన్నారు.

# వృత్యంతర శిక్షణ కేంద్రాల పెంపు

- బడి పిల్లల్లాగా ట్రైనింగ్ ఎగ్గొడుతున్న కొద్దిమంది టీచర్లు
- తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ మొరాయింపు

ఖమ్మంలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు

ఖమ్మం అర్బన్, మే 15: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఏర్పాటుచేసిన వృత్యంతర శిక్షణ మొదటి దశ కార్యక్రమంలో భాగంగా మొదటి విడత ట్రైనింగ్ ఖమ్మం జిల్లా కేంద్రంలోని హార్వెస్ట్ పాఠశాలలో జరుగుతోంది. కాగా, మరో 2 విడతల వృత్యంతర శిక్షణ కార్యక్రమాలకు ఉపాధ్యాయుల సంఖ్య ప్రాతిపదికన మరో 2 కేంద్రాల ఎంపికలో భాగంగా మరో 2 ప్రైవేటు పాఠశాలలను డీఈవో సత్యనారాయణ గురువారం పరిశీలించారు. ఉపాధ్యాయుల శిక్షణకు అవసరమయ్యే ఐఎఫ్‌పీ ప్యానల్‌లతోపాటు మౌలిక వసతుల కల్పనను పరిశీలించారు. మే 20 నుంచి 24 వరకు 2వ దశ శిక్షణ ప్రారంభం కానున్నదని, సదరు కేంద్రాల్లో ఉపాధ్యాయులకు సరిపడా మౌలిక వసతులు కల్పిస్తామని, చివరన 3వ దశలో మే 27 నుంచి 31 వరకు శిక్షణ ఉంటుందని డీఈవో వివరించారు.

**బడి పిల్లల్లా ఎగ్గొడుతున్న కొద్దిమంది ఉపాధ్యాయులు..**

మొదటి విడత వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఎస్ఏ (ఆంగ్లం) విభాగంలో 326 మంది, ఎస్ఏ (గణితం) విభాగంలో 453 మంది, ఎస్ఏ (సోషల్) విభాగంలో 436 మంది, ఎంఆర్పీలు 168 మంది, ప్రత్యేక విద్య విభాగంలో 62 మంది హాజరు కావాల్సి ఉంది కానీ బడిపిల్లల్లాగా కొందరు ఉపాధ్యాయులు కూడా శిక్షణ మధ్యలోనే సంబంధిత ఇన్‌చార్జులకు చెప్పకుండా చడీచప్పుడు లేకుండా జారుకుంటున్నారు. మరికొంతమంది ఉపాధ్యాయులు పూర్తిగా హాజరు కాకుండా సహచర ఉపాధ్యాయుల ద్వారా సంతకాలను మేనేజ్ చేస్తున్నారు. ఉపాధ్యాయుల హాజరుపై ఉన్నతాధికారులు సరైన విధంగా దృష్టి సారించడం లేదంటూ నిత్యం హాజరయ్యే ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు. సదరు శిక్షణ కేంద్రంలో కొంతమంది ఉపాధ్యాయులకు ఏసీ సౌకర్యం కల్పించగా మరికొంత మంది శిక్షణ ఉపాధ్యాయులకు ఏసీ సౌకర్యం కల్పించలేదు. దీంతో ఏసీ లేని ఉపాధ్యాయులు పెదవివిరుస్తున్నారు. ఇదే విషయాన్ని రీసోర్స్‌పర్సన్లు, యూనియన్ల బాధ్యులు కలిసి జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లారు. పైగా, మధ్యాహ్న సమయంలో ఎండలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఒక్కపూటనే శిక్షణ పూర్తి చేయించాలని వారు కోరుతున్నారు.

**మొరాయిస్తున్న యాప్..**

ఉపాధ్యాయుల శిక్షణ సమయంలో ఆన్‌లైన్ ద్వారా హాజరు ఇస్తుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కసారిగా ఉపాధ్యాయులు ఉదయం 9:30నిమిషాల సమయం, సాయంత్రం 5 గంట సమయంలో యాప్‌ను ఓపెన్ చేస్తున్నారు. దీంతో సాంకేతిక లోపాలతో సంక్షిప్త సందేశాలు ఉపాధ్యాయులకు అందకుండా మొరాయిస్తోంది. దీంతో ఉపాధ్యాయులు కొంతమేర గందరగోళానికి గురవుతున్నారు. ఆన్‌లైన్‌లోనే హాజరు ఇస్తుండడంతో యాప్ సరిగా పనిచేయక ఉపాధ్యాయులు కొంత ఇబ్బందికి గురవుతున్నారు.

## చిట్టి చేతుల 'చల్ల'దనం



చిన్న కర్రలతో వేసిన పందిరిలో చిన్నపాటి చలివేంద్రం పెట్టి పాదచారులకు మజ్జిగ, నిమ్మరసం అందజేస్తున్న చిన్నారులు

సత్తుపల్లి, మే 15: స్తోమతలో నిరుపేదలైన కొందరు చిన్నారులు.. సాయంలో శ్రీమంతులై సహచరులకేగాక సమాజానికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. చనువిస్తే చటుక్కున సెల్‌ఫోన్ అందుకొని రీల్స్‌లో తలదూర్చే చిన్నారులున్న ఈ రోజుల్లో.. కొద్దిమంది విద్యార్థులు మాత్రం వాటిని కాస్త దూరం పెడుతున్నారు. ఆ తరువాత కాస్త సమయస్ఫూర్తితో ఆలోచించి తమ చిట్టి చేతులతో గట్టి కార్యానికే శ్రీకారం చుట్టారు. పెద్దలనూ ఆలోచింపజేశారు. వారే.. సత్తుపల్లి గాంధీనగర్‌కు చెందిన నిరుపేద చిన్నారులు. భానుడు భగభగమండుతూ నిప్పుల వర్షం కురిపిస్తున్న మిట్టమధ్యాహ్నం వేళ.. బాటసారులు దాహార్తితో తచ్చాడుతున్న దృశ్యాలను బాగా గమనించారు ఆ చిన్నారులు. దీంతో తమకు తోచినంతలో వారి దాహార్తి తీర్చాలనుకున్నారు వారు. అనుకున్న వెంటనే ఆ తలంపునకు శ్రీకారం చుట్టారు. ఆ వీధి చివరి వరకూ తిరిగి చిన్న చిన్న కర్రలను సేకరించారు. వాటితో ఒక దగ్గర ప్రహరీకి ఆనించి చిన్నపాటి పందిరి వేశారు. దానిపై పాత చీరెలు, బస్తాలను కప్పారు. దానిని చలివేంద్రంగా తీర్చిదిద్దారు. తమ పాకెట్ మనీతో కొనుగోలు చేసి తెచ్చిన పెరుగుతో చల్లని మజ్జిగ తయారు చేశారు. ఆ ఎండలో అటుగా వెళ్తున్న పాదచారులకు, పారిశుధ్య కార్మికులకు బుధవారం మధ్యాహ్నం ఆ చల్లటి మజ్జిగను అందించి వారి దాహార్తి తీర్చారు. తమ పాఠశాలలో 3, 4, 5, 6 తరగతులు చదివే చిన్నారులు ఇంతటి గొప్ప మనుసు చాటుకోవడాన్ని గమనించిన స్థానిక విశ్వశాంతి పాఠశాల ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు, సత్యనారాయణ.. ఆ విద్యార్థులను అభినందించి కొంత మొత్తాన్ని విరాళంగా అందించారు. ఆ మొత్తంతో నిమ్మకాయలు కొనుగోలు చేసి తెచ్చిన చిన్నారులు.. గురువారం మధ్యాహ్నం అదే చలివేంద్రంలో నిమ్మరసాన్ని కూడా బాటసారులకు అందించారు. 'మీకీ ఆలోచన ఎలా వచ్చింది?' అంటూ ఆ బాటసారులు సదరు చిన్నారులను ప్రశ్నించగా.. 'నిరుడు గోదావరి, మున్నేరు వరదల్లో ప్రజలు నిరాశ్రయులు కావడం మమ్ములను కలిచి వేసింది. అప్పుడు కూడా సహచర విద్యార్థులందరమూ కలిసి బియ్యం, నగదు సేకరించి వరద బాధితులకు అందించాం. ఇప్పుడు కూడా ఎర్రటి ఎండలోనూ పనులమీద ఇటుగా వెళ్తున్న బాటసారుల దాహార్తి తీర్చేందుకే ఇలా చేశాం' అంటూ చిట్టి చేతులతో 'చల్ల'టి మజ్జిగ అందిస్తూ గొప్ప సందేశాన్ని ఆవిష్కరించారు.

## డిమాండ్‌కు తగ్గ చేపల ఉత్పత్తి లేదు



రైతులకు శిక్షణ ఇస్తున్న సీనియర్ సైంటిస్టు డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి

కూసుమంచి, మే 15: మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గ చేపల ఉత్పత్తి జరగటం లేదని, రైతులు వ్యవసాయంతోపాటు చేపల పెంపకం చేపడితే అదనపు ఆదాయం వస్తుందని స్కూల్ ఆఫ్ ఫిషరీస్, సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ సీతాపూర్, గజపతి జిల్లా ఒడిస్సాకు చెందని సీనియర్ సైంటిస్టు డాక్టర్ జీ.విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. గురువారం పాలేరులో రాష్ట్రంలోని ఖమ్మం, హన్మకొండ, కామారెడ్డి, నిజామాబాద్, హైదరాబాద్, మెడ్చల్, మల్కాజ్‌గిరి సూర్యాపేట, నాగర్‌కర్నూల్, సిరిసిల్లా జిల్లాకు చెందిన 30 మంది మత్స్య రైతులకు పీవీ.నర్సిహారావు పశు,వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని మత్స్య పరిశోధనా కేంద్రం పాలేరులో మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తారు. విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణ వల్ల చాలా పయోగాలున్నాయని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు లవ్‌కుమార్, శ్యాం ప్రసాద్, రవీంద్, గణేశ్ చేపల పెంపకం విధి విధానాలపై మత్స్య రైతులకు వివరించారు.

## సాగర్ కాలువ యూటీ పనులను పరిశీలించిన ఎస్ఈ



పాలేరు ప్రధాన కాలువ యూటీ పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ మంగళపూడి

కూసుమంచి, మే 15: పాలేరు ప్రధాన కాలువపై మినీహైడెల్ ప్రాజెక్టు దాటిన తరువాత వరదలకు కొట్టుకొని పోయిన యూటీ పనులకు గురువారం ఎన్నెస్పీ ఎస్ఈ మంగపూడి వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. జలాశయం నుంచి వెళ్లే ప్రధాన కాలువకు గత ఆగస్టు 31వ తేదీ అర్ధరాత్రి వచ్చిన వరదలతో కారణంగా యూటీ కొట్టుకొని పోయింది. దీంతో వానకాలం, యాసంగిలో మోటర్ల ద్వారా నీటిని అందించారు. వానకాలం మొదలు కాకముదే పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ తెలిపారు.

## తహసీల్దార్ల బదిలీలు

మామిళ్లగూడెం, మే 15 : రాష్ట్రవ్యాప్తంగా జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. ఇతర జిల్లాలకు చెందిన తహసీల్దార్లను ఖమ్మం జిల్లాకు బదిలీ చేస్తూ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్‌చీఫ్ కమిషనర్ నవీన్ మిత్తల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీపై వచ్చిన వారు త్వరలోనే జిల్లాలో రిపోర్టింగ్ చేయనున్నారు. వీరికి కలెక్టర్ పోస్టింగులు ఇవ్వనున్నారు.

| పేరు | ప్రస్తుత జిల్లా | కేటాయింపు జిల్లా |
|---|---|---|
| ఎం.రమాదేవి | భద్రాద్రి కొత్తగూడెం | ఖమ్మం |
| వై.రామారావు | ఖమ్మం | జయశంకర్ భూపాలపల్లి |
| జి.ప్రతాప్ | ఖమ్మం | భద్రాద్రి కొత్తగూడెం |
| డి.సైదులు | మహబూబాబాద్ | ఖమ్మం |
| ఎస్.శ్వేత | మహబూబాబాద్ | ఖమ్మం |
| ఏ.పున్నంచందర్ | ఖమ్మం | మహబూబాబాద్ |
| ఎస్వీ రమణమూర్తి | మహబూబాబాద్ | ఖమ్మం |